ప్రజాశక్తి
బుధవారం 26 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం

అభివృద్ధి ప్రణాళిక రూపొందించండి

కలెక్టరేట్ :ప్రజల జీవన ప్రమాణాల మెరుగుపరచేందుకు ఆశావాహక బ్లాకు ప్రోగ్రాం రూపొందించినట్లు నీతిఅయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నీతిఅయోగ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బ్లాకు స్థాయి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా టూరిజం, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, మౌలికసదుపాయాలు, స్థానికంగా గల అభివృద్ధి అవకాశాలను క్రోడీకరించి అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ సూచనలను అనుసరించి జిల్లాలో టూరిజం, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్థానికంగా గల అభివృద్ధి అవకాశాలతో కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, పి.కిరణ్ కుమార్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, ఓ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు

మతోన్మాద బిజెపిని తరిమి కొట్టాలి

- అడవిపై హక్కులు ఆదివాసీలవే
- ప్రచారభేరి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కురుపాం, గుమ్మలక్ష్మీపురం

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మతోన్మాద బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ఏకం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రచార భేరీలో భాగంగా మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, సిపిఐ నాయకులు తోట జీవన్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్యఅతిథులుగా వి.శ్రీనివాసరావుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య పాల్గొన్నారు. ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బిఎస్‌ఆర్ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పండిన అటవీ సంపదపై గిరిజనులకే హక్కు ఉంటుందని అన్నారు. పీసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో ఉండే ప్రతి సెంటు భూమి పంచాయతీ తీర్మానం లేకుండా అమ్మడానికి గాని, కొనడానికి గాని వీలులేదని, అటువంటిది 1/70 చట్టం, జీవో నెంబర్ 3కు తూట్లు పొడుస్తూ అడవులను కూడా అదానీకి ధారాదత్తం చేయడానికి బిజెపి ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని అన్నారు. కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజలు ఐక్యం కాకుండా చేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. కనీసం గిరిజన ప్రాంతంలో పండిన పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం కల్పించ లేకపోవడం శోచనీయమన్నారు. నల్లచట్టాలను తీసు కొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు బిజెపి కట్ట బెట్టేందుకు చూస్తే అడ్డుకొని రద్దు చేసే వరకు పోరాడింది ఎర్రజెండాలేనని గుర్తు చేశారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయని అన్నారు. మతోన్మాద బిజెపిని తరిమి కొట్టడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ అధికారం కోసం రాష్ట్రంలో రెండు పార్టీలూ యాత్రలు చేపట్టాయి తప్ప ప్రజల ప్రయోజనం కోసం కాదని విమర్శించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న దుశ్చర్యలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి గాని, ప్రతిపక్ష టిడిపి గాని, జనసేన గాని ఖండించడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బారావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె. మన్మధరావు, సిపిఎం నాయకులు కె.గంగు నాయుడు, వి.ఇందిర, మండంగి శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు జి.సూరయ్య, పి.ప్రసాద్, ఎల్విన్ పేట ఎంపిటిసి మండంగి రమణ, కుక్కిడి సర్పంచ్ జి. రాజారావు, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లు వినతి

కురుపాం : దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కురుపాం, గుమ్మలక్ష్మీపురం గ్రీన్ అంబాసిడర్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 నెలలుగా తమకు జీతాలు అందలేదని, ఇదే పనిని నమ్ముకుని జీవనం సాగిస్తూ తెల్లవారి లేవగానే గ్రామాలను శుభ్రం చేస్తే జీతాలందక తాము మాత్రం దుర్భర జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము, తమ కుటుంబాలు బాగుంటేనే గ్రామాలు బాగుంటా యని, అలాంటిది తమకు జీతాలు ప్రభుత్వం సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పి.మాధవ, మల్లేష్, అనంతరావు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు వినతిని అందజేస్తున్నగ్రీన్ అంబాసిడర్లు

విద్యాశాఖ అధికారులను విచారిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సస్పెన్షన్లపై కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో విద్యాశాఖలో జరిగిన సస్పెన్షన్ల పట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ విచారణ జరిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులను విచారించారు. విచారణలో పాలకొండ డిప్యూటీ డిఇఒ ఆర్.విజయకుమారి, సహాయ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారి కె.రోజారమణి, వీరఘట్టం మండలం రేగులపాడు కెజిబివి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చెన్న రోహిణి, ఎంఇఒ పి.కృష్ణమూర్తి, శ్రీకాకుళం ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డిపో మేనేజర్ ఎన్.సతీష్ పాల్గొన్నారు.

వెనుతిరిగిన విద్యాశాఖ అధికారులు

వీరఘట్టం : మండలంలోని రేగులపాడులో కెజిబివిలో ఈనెల 20న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని ఆగ్రహంతో డిఇఒ ఎస్‌డివి రమణ, ఎంఇఒ పి.కృష్ణమూర్తి, సహాయక జిసిడిఒ కె.రోజారమణి, కెజిబివి ప్రత్యేక అధికారి సిహెచ్ రోహిణిను సస్పెండ్ చేశారు. వీటికి సంబంధించి విచారణ అధికారిగా సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనాకుమారిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కెజిబివిని విచారణ చేపట్టేందుకు వస్తారని విద్యాశాఖ అధికారులంతా సిద్ధంగా ఉన్నారు. అయితే వీరికి కలెక్టరేట్ నుంచి పార్వతీపురం రావాలని మౌఖిక ఆదేశాలు రావడంతో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారితో పాటు విద్యాశాఖ అధికారులంతా పార్వతీపురం పయనమయ్యారు.

లక్ష్యం మేరకు మిల్లర్లు బియ్యం అందించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఎఫ్‌సిఐ, సిఎస్‌సికి అందించాల్సిన ధాన్యం ఆడిన బియ్యం సకాలంలో అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో సివిల్ సప్లయి అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో బియ్యం రవాణాపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ లక్ష్యం మేరకు సకాలంలో బియ్యం రవాణా పూర్తిచేయాలని తెలిపారు. బియ్యం రవాణాకు కావాల్సిన వాహనాలు అందించాలని, లోడింగు, అన్ లోడింగుకు హమాలీలను సమకూర్చుకోవాలని అధికారులకు తెలిపారు. అంటిపేట, సింగన్నపాలెం, బలిజపేట, బూర్జ వద్ద గల గోడౌన్లకు బియ్యం సప్లయి చేసేందుకుగాను రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని సరఫరా పూర్తిచేయాలని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎండి నాయక్ మాట్లాడుతూ మిల్లులకు 2.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అందించగా, మిల్లర్లు 1.43లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం బియ్యం అందించాల్సి ఉండగా ఇంతవరకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందించామని, ఇంకా 29.30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో డిఎస్ఒ కెవిఎల్ఎన్ మూర్తి, ఎఫ్‌సిఐ మేనేజరు ప్రఫుల్ల కుమార్, క్వాలిటీ కంట్రోల్ మేనేజరు ప్రశాంత్ బెహ్రా, మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, మిల్లర్లు హాజరైనారు.

కిసాన్ డ్రోన్ పైలట్లను గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో కిసాన్ డ్రోన్ పైలట్లను గుర్తించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లా నుండి 45 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని, ఇప్పటి వరకు 13 మందిని గుర్తించినట్టు తెలిపారు. ప్రాథమిక రంగ శాఖల అధికారులతో మంగళ వారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ రైతు యంత్ర సేవా కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేయాలన్నారు. ఈ నెల 28 నాటికి కొనుగోలుకు ఇండెంట్ పెట్టాలని స్పష్టం చేశారు. చిరు ధాన్యాల పంట విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు భరోసాలో ఆర్ఒఎఫ్ఆర్ భూములకు సంబంధించిన రైతుల వివరాలు పూర్తిగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యాన శాఖ అధికారులు చేస్తున్న కార్యకలాపాలను వీడియో రూపంలో నివేదిక సమర్పించాలన్నారు. సూక్ష్మసేద్యం లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు. పశువులకు వ్యాక్సినేషన్ పక్కాగా జరగాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం పశు వైద్య శిబిరాలు జరగాలన్నారు. పశువులకు డీ వార్మింగ్ చేయాలని స్పష్టం చేశారు. సంతల్లో పశువుల క్రయ విక్రయాలను పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సందర్శించాలని ఆదేశించారు. సంతలకు పశువులు ఏ ప్రాంతాలు, జిల్లాలు, రాష్ట్రాల నుంచి వస్తున్నాయి, వ్యాధులు ఉన్నాయా, ఉంటే ఆ ప్రాంతంలో ఏం చర్యలు చేపట్టారు వంటి అంశాలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో 587 మెట్రిక్ టన్నుల సమీకృత పశుదాణా (టిఎంఆర్) అందుబాటులో ఉందని, రైతులకు కొనుగోలుపై అవగాహన కల్పించాలన్నారు. మత్స్య యూనిట్ల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లకు జిల్లా అధికారులు జిల్లా స్థాయి నుండి, మండల అధికారులు మండల స్థాయి నుండి విధిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎ.ఈశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య, ఎపిఎంఐపి పిడి ఎల్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై కంట్రోల్ రూం

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యుఎస్ సబ్ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి తాగునీటి సమస్యలు ఉన్నా కంట్రోల్ రూంకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నెంబర్: 8639963063.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చింతపండు పిక్కతీత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని చింతపండు పిక్కతీత కార్మికులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం పట్టణంలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27రోజులుగా చింతపండు పిక్కతీత కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి మూడేళ్లకొకసారి చింతపండు వ్యాపారులు, కార్మికుల మధ్య పిక్కతీత కూలి రేట్లకు సంబంధించి ఒప్పందం జరుగుతుందని చెప్పారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం కార్మికులకు కిలో చింతపండు పిక్కతీతకు రూ.19 చెల్లించేవారని చెప్పారు. 2023లో కొత్త ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉందన్నారు. కిలో చింతపండు పిక్కతీతకు రూ.24 కావాలని కార్మికులు కోరుతున్నారని చెప్పారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పిక్కతీత రేటు పెంచాలని కోరుతూ కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చింతపండు పిక్కతీత కార్మికుల సంఘం నాయకులు అల్లు శ్యామల, పార్వతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

12.8 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఇటీవల ఏనుగుల సంచార కారణంగా 12.8 ఎకరాల్లో పంటల నష్టం వాటిల్లినట్లు స్థానిక అటవీశాఖ అధికారి పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి చెరుకు 3.46 ఎకరాలు, మొక్కజొన్న 6.92 ఎకరాలు, అరటి 1.20 ఎకరాలు, మిరప 0.50 ఎకరాలతో పాటు 8 కొబ్బరి చెట్లు ధ్వంసం చేసినట్లు తెలిపారు.

మూలిగూడలో మెగా యూత్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన మూలిగూడలో మెగా యూత్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.భాస్కరరావు, పి.విజయ్, పి.చిన్నారావు, పి.కామేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల నుంచి దాదాపు 70 జట్లు పాల్గొంటున్నాయని, ఈ నెల 26 నుంచి మే 25 వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం సామల సింహాచలం మూలిగూడ టీమ్‌ను అభినందిస్తూ ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ క్రికెట్ టీమ్ సభ్యులు, అసిస్టెంట్ టీచర్ ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

సెలవులే ఇవ్వలేదు... పాఠశాలలు పున: ప్రారంభం కాలేదు

మొదలైన విద్యావ్యాపారం

ప్రజాశక్తి-పార్వతీపురం

వేసవి సెలవులు ఇవ్వకముందే.. పాఠశాలలు పున: ప్రారంభం కాకముందే ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ విద్యార్థుల తల్లిదండ్రుల్లో వణుకుపుట్టిస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో అత్యంత లాభసాటి వ్యాపారాల్లో విద్య ఒకటిగా మారింది. ప్రజాప్రతినిధుల నుంచి వ్యాపారుల వరకూ అందరూ ఇందులో పెట్టుబడులు పెడుతున్నారు. జిల్లాలో ప్రైవేటు జూనియర్ కాలేజీలు, హైస్కూళ్లు సుమారు 150కు పైగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ముగియక ముందే వాటి వ్యాపారం ప్రారంభించారు. అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల చేరికలను ప్రారంభించేశారు. అడ్మిషన్ల టైం లోనే పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, షూలను విక్రయిస్తూ అదనపు ఆదాయం గడిస్తున్నాయి. అది కూడా రెట్టింపు రేట్ల దోపిడీతో పుస్తకాల విక్రయాల ద్వారా ప్రైవేటు స్కూళ్ళ తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు జూన్‌లో ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ లాంటి విద్యార్థి సంఘం పుస్తకాలు, యూనిఫారం వ్యాపారంపై ఆందోళనలు చేస్తుండటంతో విద్యా సంవత్సరం ముందుగానే ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారాన్ని ప్రారంభించాయి. గత రెండు నెలలుగా పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులకు, జూనియర్ కాలేజీలు అధ్యాపకులకు అప్పగించాయి. ఇప్పటికే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు బకాయి చెల్లించని యెడల వచ్చే విద్యా సంవత్సరం పుస్తకాలు ఇచ్చేది లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రెండేళ్ల ఫీజు ఒకేసారి చెల్లిస్తేనే పాఠ్యపుస్తకాలు ఇస్తామంటూ ఇబ్బంది పెడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోక పోవడంతో వారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

భారీగా పెరిగిన ఫీజులు

జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు వచ్చే ఏడాదికి భారీగా ఫీజులు పెంచేశారు. ప్రతి తరగతికి కనీసం రూ.పదివేలు నుంచి రూ.20వేలు వరకు ఫీజులు పెంచేశారు. రక రకాల పేర్లతో తరగతులను విభజించి ఫీజులను గుంజుతున్నారు. టెన్త్ విద్యార్థికి ట్యూషన్ ఫీజు కింద రూ.27వేలు, 9వతరగతి ట్యూషన్ ఫీజు కింద రూ.23,500 దీనికి అదనంగా మరో రెండు వేలు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మేలుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువు తక్కువ.. ఫీజులెక్కువ

విద్యా వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

వచ్చే విద్యా సంవత్సరానికి ముందుగానే ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపారం మొదలు పెట్టాయి. వెంటనే జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి రూ.3వేలు నుంచి రూ.5వేలు కట్టించుకొని సీట్లు బలవంతంగా భర్తీ చేసుకోవడం దారుణం అలాగే ఇప్పటి నుంచే పుస్తకాలు అమ్మేయడం జరుగుతుంది. జిల్లా విద్యా శాఖ అధికారులు, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి.

పి.రాజశేఖర్,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి,

పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను అరికడితే మలేరియా వ్యాధిని నివారించవచ్చునని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నిర్ధారణ పరీక్షల ఫలితంగా కేసులు పూర్తివివరాలు తెలిశాయని, వాటిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దోమతెరలు పంపిణీ, స్ప్రేయింగు, నిర్ధారణ పరీక్షలు నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. మలేరియా దోమకాటు వల్ల ఏర్పడుతుందని కావున ఇంట్లోనూ, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని, దోమల నివారణ పద్ధతులను ఆచరించాలని తెలిపారు. మే 15నుంచి స్ప్రేయింగు కార్యక్రమం మొదలగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ మలేరియా లేని జిల్లా సాధించాలని తెలిపారు. సచివాలయం, ఆరోగ్య, మునిసిపల్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి దీనిపై అవగాహల కల్పించాలని సూచించారు. ఇంటి లోపల కుండీలు, ఫ్రిజ్‌ల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వాటర్, సెప్టింక్ ట్యాంకు లకు మూతలు, మెస్‌లు కట్టుకోవాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ డి.బాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషను అధికారి టి.జగన్ మోహన్ రావు, డా.నవీన్ కుమార్, డా. వినోద్ కుమార్, సహాయ మలేరియా అధికారి డి. సూర్యనారాయణ, శానటరీ ఇన్‌స్పెక్టరు సిహెచ్.మురళి, జివిఆర్ఎస్ కిషోర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిమి, దోనుబాయి, మర్రిపాడు, సీతంపేట పంచాయతీల పరిధిలోని పాఠశాలల్లో మలేరియా నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కె.సత్యం మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ దోమతెరలు వినియోగించుకోవాన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కళావతి, వెంకినాయుడు, వైద్యులు లావణ్య, సాయిచరణ్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహనరావు పాల్గొన్నారు.

భామిని : స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఫణికుమార్, బాలేరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.దీపికారాణి ఆధ్వర్యంలో భామిని, బాలేరులో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, మలేరియా వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కలిగించారు. మలేరియా దోమల నివారణ పట్ల స్థానిక బి ఆర్ అంబేద్కర్ గురుకులం, జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు వైద్యాదికారి ఫణికుమార్ వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర, సిహెచ్ఒ హనుమంతరావు, సబ్ యూనిట్ అధికారి అప్పారావు, సర్పంచ్ లోపింటి రాజేష్, ఉపాధ్యాయులు కలిశెట్టి విజయ్, ప్రిన్సిపల్ విజయ నిర్మల, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. స్థానిక సచివాలయం నుంచి బస్టాండ్ వరకు ప్రజా ప్రతినిధులు, వైద్య, సచివాలయం సిబ్బంది, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పరిధిలో వైద్య సిబ్బంది కూడా మలేరియా దినోత్సవన్ని పురస్కరించుకొని మలేరియా నివారణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు బంగారు నాయుడు, టివి స్వామియూజులు, జెడ్‌పి హైస్కూల ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్, సూపర్వైజర్లు కె.రాధాకష్ణ, ఆదినారాయణ, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యాన ప్రపంచ మలేరియా దినోత్సవం భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.ప్రదీప్‌కుమార్, పి.ఉమామహేశ్వరి, సూపర్వైజర్లు పార్వతి, శాంతి కుమారి, నవోనమ్మ, ఆనందరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా సీతానగరం, పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.వైద్యాధికారులు శిరీష, రాధాకాంత్, ఉషారాణి, ఇఒపిఆర్‌డి కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

సీతంపేటలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి శోభారాణి

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

పార్వతీపురం రూరల్ : మండలంలోని 30 పంచాయతీల్లోనూ నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు క్రాష్ ప్రోగ్రాం ద్వారా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి మజ్జి శోభారాణి తెలిపారు. మంగళవారం మండల కార్యాలయ ఆవరణలో క్రాస్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన వాహనాన్ని ఎంపిడిఒ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. మండలంలోని 105 గ్రామాల్లో ఇప్పటికే ఉన్న 635 బోర్లను 45 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ ద్వారా నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పైపులు, ఇతర సామాగ్రి కలిగిన వాహనం అన్ని పంచాయతీలను సందర్శించి మరమ్మతులు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ బసవరాజు, ఇఒపిఆర్‌డి కృష్ణుడు, సిబ్బంది జోత్స్న, సురేష్, గోవిందరావు, బోర్ మెకానికులు శ్రీనివాసరావు, బాబ్జీ, రాజేష్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలో వీరఘట్టం, కురుపాం, మక్కువ, గుమ్మలక్ష్మీపురం తదితర మండలంలోని మంగళవారం రాత్రి గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గత మూడు రోజులుగా భానుడు తన ప్రతాపాని చూపడంతో ప్రజలు ఉక్కపోతకు ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. రాత్రివేళ సమయంలో వర్షం పడడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గాలులు, ఉరుములు మెరుపులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు చీకట్లోనే కాలం కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి.

పాలకొండ : ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాధులు

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

పార్వతీపురం రూరల్ : ఉపాధి పనుల్లో హాజరు నమోదు కచ్చితంగా మొబైల్ యాప్ ద్వారా జరగాలని, నమోదులో ఎటువంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎంపిడిఒ విజయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం నర్సిపురం పంచాయతీ కారాడవలస సమీపాన జరుగుతున్న చెరువు పనులను పరిశీలించారు. వేతనదారుల సంఖ్య, హాజరు నమోదు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉపాధి పనులు జరగాలని, అందుకు ఇబ్బందులు ఏమైనా ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎంపిడిఒ

పాలకొండ రూరల్ : మండలంలోని చిన్న మంగళాపురం, యరకారాయపురం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న చెరువు పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. సమయపాలన పాటించి పనులకు హాజరు కావాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పని వేళలు పాటించాలి

బలిజిపేట : ఉపాధి కూలీలంతా సకాలంలో పని ప్రాంతాల వద్దకు వెళ్లి పని వేళలు పాటించాలని ఎంపిడిఒ ఎ.భానుమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని సుభద్రలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశం వద్ద మౌలిక వసతులు కల్పించకపోవడం, ముందస్తు కొలతలు ఇవ్వకపోవడంపై క్షేత్ర, సాంకేతిక సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనదారులంతా పని సమయాలను పాటించాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చల్లని వేళల్లో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ కేశవరావు, సాంకేతిక సహాయకులు బి.ఏసేబు, పాల్గొన్నారు.

భామిని కెజిబివి పరిశీలన

భామిని : మండలంలోని బొమ్మిక, పకుడిభద్రలో సమగ్ర భూ సర్వే పూర్తి చేసి, రెవెన్యూ సిబ్బంది చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. స్టోన్ ప్లాంటేషన్ నిర్వహణ వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం భామిని కెజిబివిని పరిశీలించి అకాడమిక్ పుస్తకాలన్నీ అందుబాటులో ఉన్నాయని, పూర్తిస్థాయిలో సిలబస్ పూర్తి చేశారా అన్న అంశాలు అడిగి, పరీక్షలు సక్రమంగా రాస్తున్నారనే అంశాలు విద్యార్థులను అడిగారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్‌ఒ శారద, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పలు గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు

బొబ్బిలి రూరల్ : మండలం, పట్టణంలోని పలు గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం జరిగాయి. మల్లమ్మ పేటలో కొత్తమ్మతల్లి, దేశతల్లి, బంగారమ్మ ఉత్సవాలు, కోమటిపల్లిలో సరిపోలమ్మ, యం. భుర్జివలసలో బంగారమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహిం చారు. దీంతో బొబ్బిలి పట్టణం, ఆయా గ్రామాలు జన సందోహంతో నిండి పోయాయి. కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. కోమటిపల్లి, మల్లమ్మ పేట పండగల్లో మాజీ ఎంపి బొత్స ఝాన్సీ, మల్లమ్మ పేట, యం.భుర్జివలస, కోమటిపల్లి గ్రామదేవత ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆయా గ్రామ దేవత ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

భామిని మండలం సోలికిరి గ్రామంలో.. సకాలంలో వర్షాలు కురుస్తూ, పంటలు బాగా పండి, రైతు, గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవత నూకలమ్మకు మంగళవారం గ్రామస్తులు ఘటాలు సమర్పించారు. పసుపు మూర్రాటతో మహిళలు, పురుషులు డప్పు వాయిద్యాలతో గ్రామ దేవత నూకాలమ్మ ఆలయానికి చేరుకుని, పసుపు నీళ్లతో అభిషేకం చేసి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్త కోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపిటిసి సభ్యులు ఉషారాణి పాల్గొన్నారు.

నేడు సిటియులో పర్సనాలటీ డెవలప్‌మెంట్‌పై సెమినార్

విజయనగరం : కొండకరకాం వద్ద నున్న ట్రైబల్ యూనివర్సిటీ లో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్తంగా కెపాసిటీ బిల్డింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్‌పై సెమినార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయం నుంచి సమాచారం అందింది. ఈనెల 26 న ట్రైబల్ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్పర్సన్ వాసిరెడ్డి పద్మావతి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. సెమినార్ లో ప్రధానంగా డిజిటల్ లిటరసీ, పెర్సొనల్ కెపాసిటీ బిల్డింగ్, కెరీర్ స్కిల్ అనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.

మోడీని గద్దె దింపుదాం..

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుదామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, నిర్వాసిత గ్రామాల నాయకులు బంటు దాసు అన్నారు. పట్టణంలోని కొత్తవలసలో గల విజయరామరాజు కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రచార భేరి యాత్రలో ఇంటింటికి వెళ్లి మతోన్మాద శక్తులకు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. బిజెపి నిరంకుశ విధానాలపైన, దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా, పేదల బతుకులపై భారాన్ని మోపుతూ ఇష్టానుసారం గ్యాస్, పెట్రోలు ధరలు పెంచుతున్న బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలని సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో భాగంగా మంగళవారం అడ్డాపుశిల పంచాయితీ గోపాలపురం ఉపాధి హామీ వేతనదారులతో సిపిఎం మండల కార్యదర్శి బంటు దాసు సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాల్పడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ మాట్లాడారు. ఈనెల 27న పార్వతీపురంలో జరిగే సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కొమరాడ : ఈనెల 27న జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గంగరేగువలసలో సిపిఎం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉపాధి కూలీలు వద్దకు వెళ్లి వివరించారు. వ్యవసాయ కూలీలు, కార్మికులు, వివిధ వర్గాల ప్రజలంతా కూడా బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుఎపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రెడ్డి శివుని నాయుడు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

సకాలంలో ఉపాధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధిహామీ చట్టం ద్వారా చేస్తున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జల యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల ప్రగతి ఆశాజనకంగా ఉందన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోనూ ఉపాధి హామీ సిబ్బంది సకాలంలో ఆయా పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో ఉపాధిహామీ వేతనదారులకు తప్పకుండా నూరు రోజులు పని కల్పించాలన్నారు. అలాగే వేతనదారుల బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే పనుల్లో పాల్గొన్న వేతనదారుల హాజరు తప్పకుండా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. మండలంలో పలుచోట్ల చేపడుతున్న అమృత సరోవర్ చెరువు పురోగతి పనులను పూర్తి చేయాలని తెలిపారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఉపాధిహామీ పీడీ రామచంద్రరావు

వేతనదారులకు సమయానుకూలంగా వేతనాలు చెల్లించి పనులు పూర్తి చేయాలన్నారు. వేతనదారులకు అందని పేమెంట్లను మరల వారి అకౌంట్లకు జమ అయ్యేలా చూడాలన్నారు. వేతనదారులకు సరాసరి వేతనం అందేలా సిబ్బంది పని చేయాలన్నారు. 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్షేత్ర సహాయకులకు, వేతనదారులకు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. అంతేకాక ఈ ఏడాదికి గానూ మండలంలో ఉపాధి పనుల లక్ష్యాలను తొందరగా వేసి పంపించాలన్నారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఏ పంచాయతీలోనైనా ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు, ఎపిఒ శివరామకృష్ణ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ మనోజ్ కుమార్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అనుకూలమైన పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాలకొండ

వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాలకు అనుకూలమైన పాలన అందిస్తుందని స్థానిక ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతి అన్నారు. మంగళవారం మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పాలవలస రాజశేఖరం స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల చెంతకు చేరి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. అలాగే ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజల్లో నిరంతరం నాయకులు, కార్యకర్తలు ఉండేందుకు వీలు కలుగుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, గృహసారథుల మండల సమన్వయ కర్త కోట అజయ్ తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులతోపాటు కార్యాలయంలో ఉన్న అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

సర్వే పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

21వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని 21వ వార్డు పరిధిలో సుందరనారాయణ, వివేక్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించారు. వార్డు సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే డోర్ టు డోర్ ఈ కార్యక్రమంలో చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి గత ప్రభుత్వం చేసిన మోసాలు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న మేలు, అభివృద్ధి అంశాలను వారికి వివరించి మెగా పీపుల్ సర్వేలో వారి అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, సచివాలయం కన్వీనర్లు చందాన ఆనంద్, సామల లలిత, అర్విఎస్ కుమార్, నాయకులు జక్కు చిన్నం నాయుడు, గృహ సారథులు నీరస త్రినాథ, ఆవాల సాయి, భవాని, బి రత్నం, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొండచిలకాంలో గడపగడపకు...

ప్రజాశక్తి - జియమ్మవలస

మండలంలోని కొండచిలకాంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ పథకాల అందుతున్న తీరు, వాలంటీర్లు అందిస్తున్న సేవలు గురించి ప్రజల నుంచి వివరాలు అడిగారు. సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదని లబ్ధిదారులకు నేరుగా ఖాతాలో వేస్తూ పథకాలు అందిస్తున్నారని అన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ శివున్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల

జియ్యమ్మవలస : వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కృష్ణారావు, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్, మజ్జి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని తాలాడ సచివాలయం పరిధిలో గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి.కళావతి మూర్తకారిగూడ, బెన్నడుగూడ, ఉయ్యాలగూడ, ఎగువసేరా, దిగువసేరా, సింగన్నగూడ గ్రామాల్లో పర్యటించి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల అందిస్తామని, గిరిజనులకు అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్.రాము, సింహాచలం, నిమ్మక కాంతారావు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో మంగళవారం పిడుగు పడి రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన మరడ అప్పలనాయుడు (55) పొలంలో గడ్డి కోస్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య సత్యవతి, కుమార్తె మాధురి, కుమారుడు రామకృష్ణ వున్నారు. అప్పలనాయుడు మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

'విద్యార్థి' సినిమా బృందం సందడి

విజయనగరం : సీతం ఇంజనీరింగ్ కళాశాలలో మధు మాదాసు దర్శకత్వంలో నిర్మిస్తున్న 'విద్యార్థి' సినిమా బృందం సందడి చేసింది. చిత్ర దర్శకుడు మధు మాదాసు, కథానాయకుడు చేతన్ చీను ఇతర ముఖ్య పాత్రధారులు పాల్గొని సీతం కళాశాల విద్యార్థులను ఆట పాటలతో మాటలతో అలరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కుల మతాలకు అతీతంగా మానవత్వం అలవరచుకోవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని కోరుకుంటూ చిత్ర కథానాయకుడు చేతన్ కు ఆశీర్వాదములూ, దర్శకునికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్.మజ్జి శశి భూషణ్‌రావు మాట్లాడుతూ ఈసినిమా సందేశాత్మకమైనదని, విద్యార్థులంతా తప్పక చూడాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

వంగర : ప్రభుత్వ కళాశాలలో చేరాలని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు అన్నారు. ఈ మేరకు వివిధ గ్రామాలలో ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు యొక్క ఇళ్ల వద్దకు వెళ్లి మంగళవారం ప్రచారం నిర్వహించారు.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న వీరఘట్టం

వీరఘట్టం : ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న పైడితల్లి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు వీరఘట్టంను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తెలగ వీధి జంక్షన్ ప్రధాన రహదారికి ఇరువైపుల విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. మంగళవారం విద్యుత్ దీపాలతో అలరించడంతో వీరఘట్టంలో పండగ వాతావరణం మొదలైంది. ఐదేళ్ల తర్వాత పైడితల్లి అమ్మవారి పండగ జరుపుకునేందుకు భారీ ఎత్తున ధనాన్ని పోగు చేస్తున్నారు.

విద్యుత్ కాంతులు వెదజల్లుతున్న వీరఘట్టం మెయిన్‌రోడ్

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ అంగన్వాడీ కార్యకర్తను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని తూడిలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటపాటలతో పాటు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా వండి పెట్టాలన్నారు. అలాగే రికార్డులు కూడా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా రహదారి ఉండడం వల్ల ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని కార్యకర్త ఎంపిడిఒను కోరారు. గ్రామంలో సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని సిబ్బందిని ఆదేశించారు. స్పందనకొచ్చిన అర్జీలు తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఎంపిడిఒ వెంట జూనియర్ సహాయకులు ఎస్.సూర్యనారాయణ, సచివాలయ కార్యదర్శి చిన్నారావు తదితరులు ఉన్నారు.

నారంనాయుడువలసలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

నారంనాయుడువలసలో 'ఇదేం కర్మ'

బలిజిపేట : మండలంలోని నారంనాయుడువలసలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టిడిపి మండలశాఖ అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యాన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు గ్రామ పురవీధుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాలనతో ప్రజలు విసుగెత్తారన్నారు. అందువల్లే ప్రజలంతా టిడిపి వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కావున ప్రజా సమస్యలు తీరాలంటే చంద్రబాబునాయుడును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకటనాయుడు, అప్పారావు, చంటి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుల్ల బాబ్జీ, విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎస్.వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, ఎస్.రామారావు, బి.శ్రీను, నాగేంద్ర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి హోటళ్లు తెరవాలి

పాలకొండ : రోడ్డుపై ఉన్న హోటళ్లు, టిఫిన్ బండ్లు నిబంధనలు పాటించి తెరవాలని తహశీల్దార్ పి.సోమేశ్వరరరావు హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో టిఫిన్ బండ్లు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ బళ్ళకు అద్దాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆహార పదార్థాలపై ఎటువంటి చెత్త, చెదారం పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు ఉపయోగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో డిటి బుచ్చయ్య, సివిల్ సప్లై డిటి ఉన్నారు.

నేరాలు ఘోరాలు

ఘర్షణలో గాయపడిన అన్న మృతి

బలిజిపేట : మండలంలోని నారాయణపురానికి చెందిన అన్నదమ్ముల ఘర్షణలో తమ్ముడు దాడి వల్ల అన్న మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎస్సై ఇచ్చిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారాయణపురానికి చెందిన గురాన వెంకటరమణ, గురనా రామినాయుడు అన్నదమ్ముల మధ్య చాలా కాలంగా గ్రామంలో ఉన్న కళ్లాం పంపకంలో అన్నయ్య వెంకటరమణ తమ్ముడికి సహకరించ పోవడంతో తమ్ముడు తరచూ గొడవపడేవాడు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రామినాయుడు తన అన్నయ్యను గునపాముతో బలంగా కొట్టగా వెంకటరమణ అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. సోమవారం వైద్యం నిమిత్తం విజయనగరం ప్రభుత్వవైద్యకళాశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు సిఐ విజయానంద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

మనస్థాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్ : జియ్యమ్మవలస మండలం చిన్నకొదమకు చెందిన కోరాడ గౌరమ్మ అనే మహిళ మంగళవారం తన ఇంట్లో ఉన్న చీమల మందులు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం విశాఖపట్నంలో ఉన్న తన కొడుకు, కోడలి వద్దకు వెళ్లి వచ్చిన ఆమె అక్కడ వారితో గొడవపడగా వారు తీవ్రంగా దూషించారని, దీంతో మనస్థాపం చెందింది. గౌరమ్మ తిరిగి తన గ్రామానికి చేరుకున్న వెంటనే మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక స్పందించి 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా పోలీసులు వివరాలను నమోదు చేస్తున్నారు.

అప్పు తీర్చమన్నందుకు మహిళపై దాడి

పార్వతీపురం రూరల్ : మక్కువ మండలం కొయ్యనపేటకు చెందిన నారంశెట్టి లలిత గత కొన్నేళ్లుగా మక్కువ సమీపంలో సాలూరుకు వెళ్లే రహదారిలో బడ్డీ కొట్టు పెట్టి జీవనం కొనసాగిస్తుంది. గ్రామానికి చెందిన కోట కాశీ అనే వ్యక్తి ఈమెకు బాకీ పడడంతో మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి డబ్బులు అడిగింది. దీంతో ఆగ్రహం చెందిన కాశీ లలితపై దాడి చేసి గాయపరిచారు. ఆమె కుటుంబ సభ్యులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

భామిని: మండలంలోని బొడ్డగూడ సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాతపట్నం మండలం నల్లకొత్తూరుకు చెందిన పి.సురేష్,(23), గుమలక్ష్మీపురం మండలం అచ్చంపేటకు చెందిన ఎన్. మహేష్ (22) ద్విచక్రవాహనాలపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ సంఘటనలో వీరిద్దకి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి క్షతగ్రాతులను భామిని పిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

16 మందిపై బైండోవర్ కేసులు

వీరఘట్టం : మండలంలోని 16 మందిపై తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ బైండోవర్ కేసులు నమోదు చేశారు. మండలంలోని కంబరవలస సమీపాన గతనెల 25న గొర్రుపోతు పందాలు ఆడుతుండగా పట్టుపడ్డారని, వీరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.